కిక్కురు మనకుండా చేతినిండా నూనె పోసుకొని యజ మాని మోకాళ్ళమీద సత్తువకొద్దీ రుద్దడం మొదలు పెట్టాడు సుబ్బాయి.

మోకాళ్ళు రుద్దించుకుంటూంటే రావుగారికి చమ్మగా వుంది. దివ్యమైన వూహలు మెదడులో అల్లిబిల్లి తిరగ సాగాయి.

ఆ రోజు తనుచేసిన శ్రమదానం ఈ కూలీ ముండాకొడు కులు ఎవ్వరైనా చేయగలరా? తను ఎంతబాధపడి వంగని మోకాళ్ళను బలవంతగా వంచి మట్టిపల్లికలు తలకెత్తు కొన్నాడు? ఎన్నిసార్లు మట్టి మోశాడు? ఆ మాటకొస్తే ఎక్కువమట్టి మోసింది నేనేనేమో? తన వయసులో ఆ పని, అందునా అలవాటులేని ఆ మట్టిపని ఎప్పుడు చేయగలుగుతాడు? తనకు పనిలో గౌరవమూ, ఆత్మ విశ్వాసమూ ఉండబట్టే అంత పని తను చేయగలిగాడు. అంతగా కష్టపడబట్టే తన మోకాళ్లు ఇంతగా పట్టుకుపోయాయి. సమయానికి ఆఁ రత్తాయిగాడేమో ఎగగొట్టాడు. ఈ కుర్రసన్నాసేమో ఊరికే చేతులాడించడం తప్ప వంటికి ఆనేట్టు రుద్ది ఏడవలేక పోతూన్నాడు—

చిన్నాడి ముఖమంతా చిరుచెమటలు కమ్మింది. నోరు తెరిచి గాలిపీలుస్తున్నాడు. చేతులు జారిపోతూన్నాయి. వేళ్ళు వంగడంలేదు. రుద్దీ రుద్దీ అలసిపోయాడు. కళ్ళు బైర్లు కమ్ము తున్నట్టయింది! తన చేతులు ఎక్కడ వున్నాయో, ఏం చేస్తు న్నాయో వాడి మతికి తెలియడంలేదు. యంత్రంలా తన చిన్న చేతుల్ని రావుగారి శరీరంమీద పైకి, కిందికి ఆడిస్తున్నాడు—

"ఒరేయ్ సుబ్బా! నువ్వు వళ్ళు పట్టడం ఏడ్చినట్టేవుంది గానీ ఇక ఆపుఁ. కాస్త వేళ్ళు లాగి పోయి వేడినీళ్లు బయట

చెవులు భ్రమించాయి.

గలగలశబ్దం! గాజులశబ్దం!! లంబాడీ గాజుల శబ్దం!!! పెద్దకాలవ కట్టకు అల్లంతదూరంలో ఒక రావిచెట్టూ, రావిచెట్టుకింద ఒక సమాధి — ఆ సమాధిలోనుంచీ — ఆ ఆకారం ఆ శబ్దమూ — సుబ్బాయి లేత మనస్సులో హత్తుకుపోయిన గాథ.

.... .... .... ....

అది చిన సుబ్బాయికి పెదసుబ్బాయి చెప్పిన కథ—

ఒకరోజు రాత్రి చిన సుబ్బాయి పెదసుబ్బాయి శ్రీవారి గొడ్లచావిట్లో పడుకొన్నారు. రోజూ మామూలుగా చెప్పినట్లే పెదసుబ్బాయి పేదరాసి పెద్దమ్మా, రాజు కుమారుడూ, మంమంత్రికుమారుడూ కథ చెపుతూంటే 'ఊ' కొట్టూన్న చిన సుబ్బాయి ఉండీ ఉం అన్నాడుగదా — "ఒరే పెదసుబ్బా! పెదసుబ్బా! నువ్వెప్పుడైనా దయ్యాన్ని చూశావంటారా?"

"ఓ! సూశానా మరి సూశానా! సూట్టం సూట్టం లంబాడి దయ్యాన్నే చూశాంరా సిన్నోడా!" అన్నాడు పెద సుబ్బాయి.

"కాలవకట్టుంది సూశావా? ఆడోరాయి సెట్టుంది సూశావా? ఆ చెట్టుకిందో సమాదుంది సూశావా? అదు గల్ల దా సమాధీలో వుందిరా లంబాడి దెయ్యం!" అన్నాడు పెద సుబ్బాయి.

"నిజంగారా?" ఇంతంత కళ్ళు చేసుకొని అడిగాడు సిన్నోడు.

"నిజమేందిరా నిజం? ముమ్మాటికీ నిజమైతేనూ!" అన్నాడు పెద్దోడు.

